క్లుప్తంగా

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

మునగపాక : ఎండలు విపరీతంగా ఉన్నందున కూలీలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని వాడ్రాపల్లిలో శుక్రవారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలకు ఆయన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. సురక్షితమైన నీటిని తాగడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

22న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

పాయకరావుపేట : ఈ నెల 22వ తేదీన బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నక్కపల్లి మండలంలో గల డొంకాడ గ్రామంలో ఆవిష్కరించడం జరుగుతుందని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు తుమ్మలపల్లి కుమార్ తెలిపారు. కార్యక్రమానికి జగ్జీవన్‌రామ్ అభిమానులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు హాజరు కావాలని కోరారు.

చూచుకొండలో నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

మునగపాక : మండలంలోని చూచుకొండలో శనివారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పర్యటిస్తారని సర్పంచ్ దొడ్డి సూరప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న కళ్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తారన్నారు. అలాగే పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేపడతారన్నారు. పార్టీ నాయకులు, అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూరప్పారావు కోరారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



శ్మశాన వాటిక వద్ద పొక్లెయిన్‌తో చెత్త తొలగిస్తున్న దృశ్యం

కోటవురట్ల : కె.వెంకటాపురంలో శుక్రవారం పారిశుధ్యం డ్రైవ్ నిర్వహించారు. పలు వీధుల్లో చెత్తను తొలగింపజేసి, డ్రైనేజీలలో పూడికలు తీశారు. శ్మశాన వాటిక వద్ద భారీగా చెత్త పేరుకుపోవడంతో పొక్లెయిన్‌తో శుభ్రం చేశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు గ్రామస్తులు సహకారం అందించాలని కోరారు. చెత్త సేకరణలో పారిశుధ్య కార్మికులకు సహకరించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఏడుగురు గ్రామ వలంటీర్లకు అవార్డులు

పాయకరావుపేట : మండలంలో గల ఏడుగురు గ్రామ వలంటీర్లు అవార్డులకు ఎంపికైనట్లు ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. పాయకరావుపేట ఒకటో సచివాలయంలో పని చేస్తున్న వి.సుశీల, పి.రాణి సేవా వజ్ర అవార్డులకు, పాయకరావుపేట 1,2,3,4 సచివాలయాల్లో పనిచేస్తున్న జి.రత్నకుమార్, కె.ఫణీంద్ర, పి.జ్యోతి, పి.మౌనిక, కె.నాగలక్ష్మిలకు సేవారత్న అవార్డులకు ఎంపికైనట్టు ఎంపీడీవో తెలిపారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండల కేంద్రంలో శుక్రవారం రాజయ్యపేట నూకతాత వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించేవారికి వడదెబ్బ బారిన పడకుండా ఈ మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గడచిన వారం రోజుల నుంచి ఎండలు తీవ్రంగా ఉన్నాయని వడగాడ్పులు వల్ల ఇబ్బంది పడకుండా వివిధ పనులపై నక్కపల్లి వచ్చే వారికి ఈ ప్రాంతం మీదుగా రాకపోకలు సాగించేవారికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కక్కిరాల శ్రీను, నాగేశ్వరరావు, సంతోష్ పాల్గొన్నారు.

ఇరుకు రోడ్లు...శిథిలమైన కల్వర్టులు

- ఏళ్లుగా నిలిచిన విస్తరణ పనులు
- పలు గ్రామాల ప్రజలకు తప్పని ఇబ్బందులు



అరట్లకోట వద్ద ఇరుకుగా వున్న కల్వర్టు



పెంటకోట గ్రామం వద్ద కల్వర్టు నిర్మించవలసిన ప్రదేశం

పాయకరావుపేట : మండలంలో గల పాయకరావుపేట నుంచి పెంటకోట వెళ్లే రోడ్డుకు కల్వర్టులు నిర్మాణాలకు నోచుకోకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాయకరావుపేట నుంచి అరట్లకోట, మంగవరం, గోపాలపట్నం, పెంటకోట గ్రామాల మీదుగా సముద్ర తీర ప్రాంతానికి 15 కిలోమీటర్లు పొడవునా రోడ్డు వుంది. ఈ రోడ్డు భవనాల శాఖ పరిధిలో వుంది. ఎన్నో ఏళ్ల నుంచి విస్తరణకు నోచుకోకపోవడం వల్ల ఈ రోడ్డులో ప్రయాణం ప్రజలకు ఇబ్బందిగా మారింది. రోడ్డుకు అరట్లకోట గ్రామం వద్ద సాగునీటి కాలువకు మదుము ఏర్పాటు చేశారు. గతంలో ఏర్పాటు చేసిన మదుము కావడం, రోడ్డు విస్తరణకు నోచుకోలేకపోవడం, తద్వారా కల్వర్టు విస్తరణకు నోచుకోలేదు. ఈ మదుముపై నుంచి వెళ్లడం వాహన చోదకులకు ఇబ్బందికరంగా వుంది. ఎదురెదురుగా రెండు ట్రాక్టర్లు, ఆటోలు వస్తే ఎంతో జాగ్రత్తగా రావలసి వుంటుంది. ఇందుకు మదుం కావడంతో ఏమాత్రం అదుపు తప్పినా సరే కాలువలో పడిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. గతంలో పలుసార్లు ట్రాక్టర్లు, ఆటోలు కూడా అదుపు తప్పి కాలువలోనికి పడిపోయి ప్రమాదాలు కూడా జరిగాయి. రోడ్డు విస్తరణ చేయకపోయినప్పటికీ మదుము (కల్వర్టు) మాత్రం విస్తరించాలని పలువురు వాహన చోదకులు కోరుకుంటున్నారు. అదే విధంగా పెంటకోట గ్రామ ప్రవేశం వద్ద కూడా సాగునీటి కాలువకు, ఏర్పాటు చేసిన కల్వర్టు 10 సంవత్సరాల క్రితం శిథిలమైంది. అప్పట్లోనే కల్వర్టు నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. కానీ గతంలో కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో ప్రజలు కల్వర్టు పక్క నుంచి మట్టి రోడ్డు పైనే ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం సంబంధిత అధికారులు మరలా ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అరట్లకోట కల్వర్టును విస్తరించాలని, పెంటకోట గ్రామం వద్ద కల్వర్టును పునఃనిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

అరట్లకోట వద్ద కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. పెంటకోట వద్ద కూడా కల్వర్టు నిర్మాణానికి అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపించాం.

– జ్ఞానేశ్వరరావు, ఏఈ ఆర్అండ్‌బి, పాయకరావుపేట

కల్వర్టులు లేక ఇబ్బందులు

పెంటకోట రోడ్డుకి అరట్లకోట, పెంటకోట గ్రామాల వద్ద కల్వర్టులు నిర్మించాలి. రాకపోకలకు ఎంతో ఇబ్బందిగా వుంది. వాహనదారులు రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి కల్వర్టులు నిర్మాణం చేపట్టాలి.

– బొలిశెట్టి శ్రీను, పెంటకోట

సంక్షేమ పాలన జగనన్నకే సాధ్యం

ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు



గోవిందపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి : జనరంజక సంక్షేమ పాలన జగనన్నకే సాధ్యమని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. గోవిందపాలెం గ్రామంలో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఏ కుటుంబానికి ఎంతమేర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిందీ వివరించారు. కరోనా లాంటి కష్టకాలంలోనూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్నారన్నారు. ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్న రావాలన్నారు. మళ్లీ జగనన్న రావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను గెలిపించాలన్నారు. జగనన్నను ఓడిచేందుకు ప్రతిపక్ష పార్టీలు పొత్తులుగా వస్తున్నాయని అయినా ఒంటరిగా పోటీలో దిగే జగనన్నకు అండగా నిలిచి గెలిపించాలన్నారు. ప్రతిపక్ష పార్టీలను గెలిపిస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. అలాగే ఆయా గ్రామంలో వున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వలంటీర్లకు ఎమ్మెల్యే సొంత నిధులతో సమకూర్చిన వాటర్‌ప్రూఫ్ బ్యాగులను అందజేసారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, ఎంపీడీవో కొండలరావు పాల్గొన్నారు.

ఉత్తమ వలంటీర్లకు సేవా పురస్కారాలు



సేవా వజ్రకు ఎంపికైన దుర్గా భవాని



కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ చేతుల మీదుగా పురస్కార పత్రం అందుకున్న దుర్గాభవాని

ఎస్.రాయవరం : సేవకు పురస్కారాలు మండలంలో ఒకరికి సేవా వజ్ర, అయిదుగురికి సేవా రత్న, 356 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన పురస్కారాల్లో మండలంలో తిమ్మాపురం 1 సచివాలయంలో బొలిశెట్టి దుర్గాభవాని సేవా వజ్ర, కొరుప్రోలు సచివాలయంలో మలిరెడ్డి రజని,చినగుమ్ములూరు గోగినపూడి హేమలత,ఎస్.రాయవరం1 బంగారి శ్రీనివాసరావు, తిమ్మాపురం 1 చెక్కా అరుణ్‌కుమార్, లింగరాజుపాలెం తోరం రోహిత్ లకు సేవా రత్నాకు ఎంపికయ్యారు. మిగిలిన 356 సేవా మిత్రలుగా గుర్తించి ప్రభుత్వం పురస్కారాలు అందించనుంది. ఇందులో సేవా వజ్రకి ఎంపికయిన బొలిశెట్టి దుర్గా భవానికి అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవిపటాన్‌శెట్టి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, అనకాపల్లి ఎంపీ భీశెట్టి చేతుల మీదుగా పురస్కార పత్రం అందజేశారు. సేవా రత్నా, సేవా మిత్ర వలంటీర్లకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతుల మీదుగా సత్కారం అందజేసి, పురస్కారాలు పత్రాలు అందజేస్తున్నట్టు ఈవోపీఆర్డీ సత్యనారాయణ తెలిపారు.

వలంటీర్ల సేవలు ఆదర్శప్రాయం



వలంటీర్‌కు పురస్కారం అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: వలంటీర్ల సేవలు ఆదర్శప్రాయమని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. గోవిందపాలెంలో శుక్రవారం ఆయన ఐదుగురు వలంటీర్లకు సేవా రత్న, 266 మంది వలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలు అందించి సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వలంటీర్ల ద్వారా తమ ప్రభుత్వం అవినీతికి తావులేకుండా పార్టీలకతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేసి పథకాలు ఇంటివద్దకే అందిస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు ప్రతి పథకానికి మామూళ్లు వసూళ్లు చేసేవారని విమర్శించారు. వలంటీర్లు మరింత ఉత్సాహంగా పనిచేయాలని కోరారు. ప్రభుత్వం వలంటీర్లకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్నారు.

ఘనంగా నేస్తాలమ్మతల్లి జాతర



పూజలందుకున్న నేస్తాలమ్మతల్లి

ఎస్.రాయవరం : వమ్మవరం వరహానది ఒడ్డున ఉన్న శ్రీ నేస్తాలమ్మతల్లి జాతర మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రైతుల కల్పవల్లిగా పిలువబడే ఈ అమ్మవారికి గ్రామానికి చెందిన భక్తులతో పాటు రైతులు తమ పొలాల్లో పండిన ఫలాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏడాది తొలకరి ముందురోజుల్లో అమ్మవారి పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని చెబుతున్నారు. ఈ అమ్మవారి దయతో గ్రామంలో వర్షాలు బాగా కురిసి నది ప్రవాహం పెరిగి అన్ని పంటలు సమృద్ధిగా పండుతాయని భక్తుల విశ్వాసం.

హిందీ భాష ప్రాధాన్యంపై అవగాహన



అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో హిందీ భాషపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో హిందీ భాషపై అవగాహన కల్పించారు. వేసవి గ్రంథాలయ శిక్షణ తరగతుల్లో భాగంగా 12వ రోజైన శుక్రవారం విద్యార్థులకు అచ్యుత స్కూల్ ఉపాధ్యాయురాలు తేజాంబిక భాషల ప్రాధాన్యాన్ని వివరించారు. త్రిభాషలు చదవాల్సిన అవసరం ఉందని, తద్వారా ఎక్కడికి వెళ్లినా విద్యాభ్యాసానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలకు చక్కని స్పందన



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కోటవురట్ల: వేసవి విజ్ఞాన శిబిరాలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకుంటున్నారు. సెలవులను గ్రంథాలయాలలో పుస్తక పఠనం, వివిధ పోటీలతో ఆనందిస్తున్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ ప్రత్యేక శిబిరాలకు మంచి స్పందన వస్తోందన్నారు. విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, పద్యాలు, నీతి కథలు చెప్పడం వంటి విజ్ఞాన అంశాల పట్ల సాధన చేయిస్తున్నట్టు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ డీపీఎం స్వామినాయుడు

మునగపాక: మండలంలోని చూచుకొండ, గణపర్తి గ్రామాల్లో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఖరీఫ్ పంటల సాగు చేపట్టే ముందు తీసుకోవాల్సిన చర్యలపై అడిషనల్ డీపీఎం స్వామినాయుడు అవగాహన కల్పించారు. ముందుగా భూమిలో 30 రకాల విత్తనాలను పప్పుజాతి, తీగ జాతి, ఆకుకూరలు, సుగంధ ద్రవ్యాలు, నూనె జాతి రకాల విత్తనాలను వేసి కలియ దున్నడం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయం సాగుపై దృష్టి సారించాలన్నారు. పీఎండీఎస్ విత్తనాలను పశువులకు మేతగా, భూములకు సూక్ష్మ జీవులను అందించేలా దోహదపడతాయన్నారు. ఇవి వేసిన 45 రోజుల తర్వాత భూమిలో కలియ దున్నితే భూమి సారవంతంగా ఉంటుందన్నారు. తద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చన్నారు. రైతులు కూడా మారుతున్న కాలంతో పాటు వ్యవసాయం సాగులో నూతన పద్ధతులు పాటించాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు



ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

యలమంచిలి : మండలంలో పీఎస్ఆర్‌పేట, పేట బయ్యవరం గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలు జరిగాయి. పండితులు సోమయాజ శర్మ మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. శుక్రవారం ఉదయం పీఎస్ఆర్ పేట, పేట బయ్యవరం, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ములకలాపల్లి గ్రామానికి చెందిన మహిళల హరి భజన, గీతాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పుచ్చలపల్లి జీవితం ఆదర్శం కావాలి



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం



మునగపాకలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



రాంబిల్లిలో పుచ్చలపల్లి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు

మునగపాక : స్వాతంత్ర్య ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శం కావాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు కోరారు. మునగపాకలో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవర్గాలకు పుచ్చలపల్లి అందించిన సేవలను మరువలేనివన్నారు.సీఐటీయూ నాయకులు ఎస్.బ్రహ్మాజీ, టెక్కలి జగ్గారావు, వేగి మహేష్, సత్యనారాయణ, మద్దాల కృష్ణ, వరలక్ష్మి పాల్గొన్నారు. గవర్ల అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆళ్ల మహేశ్వరరావు, డాక్టర్ నిర్మలకుమారి, జోగినాయుడు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం అచ్యుతాపురం మండలంలోని అచ్యుతాపురం, హరిపాలెం, తిమ్మరాజుపేట గ్రామాల్లో నిర్వహించారు. పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు, సీపీఎం సీనియర్ నాయకుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ పుచ్చలపల్లి పేదలు,రైతులు,దళితుల అభ్యున్నతి కోసం ఎన్నో విలువలతో కూడిన ఉద్యమాలు చేశారని తెలిపారు. అచ్యుతాపురం కన్వీనర్ ఆర్.రాము,తిమ్మరాజుపేట శాఖ కార్యదర్శి ఎస్.రాము నాయుడు,సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

రాంబిల్లి: కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య చేసిన సేవలు మరువరానివని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి. కోటేశ్వరరావు అన్నారు. రాంబిల్లిలో శుక్రవారం సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి జి. దేముడునాయుడు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ



తిమ్మరాజుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. వెలుగు ఏపీఎం కొండమ్మ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగలక్ష్మి మాట్లాడుతూ వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అతివేగం ప్రమాదకరమన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ నేరమన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా ప్రమాదాలు జరుగుతాయన్నారు. సీసీ దేవానంద్, సీఏలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలశర్మ శత జయంతి వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు సన్యాసిరావు తదితరులు

యలమంచిలి : బహుభాషా కోవిదులు ప్రముఖ కవి, శ్రీపతి వేణుగోపాలశర్మ తెలుగు సాహిత్యరంగానికి ఆయన చేసిన సేవలు మరువరానివి అని రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు శిష్టాల సన్యాసిరావు అన్నారు. ఆధ్యాత్మికవేత్త, పురాణప్రవచకులు, సాహిత్యరత్న, విద్యాభాస్కర బిరుదాంకితులు వేణుగోపాలశర్మ శత జయంతి ఉత్సవ వేడుకలు శుక్రవారం యలమంచిలి కొత్తపేట రామాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల శర్మ గురించి పరిచయ కార్యక్రమంలో పలువురు వక్తలు ఆయన సేవలపై ఉపన్యాసించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రసంగం, రామాయణం, మానవ జీవన దిక్సూచిపై భక్తిగీతాలు ఆలపించారు. వాగీశ్వరీయం వెబ్‌సైట్ ప్రారంభించారు. పలువురికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు సూర్యనారాయణ, యలమంచిలి భగవద్గీత ప్రచారకులు గాయత్రి, శిష్టాల సోమయాజులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



సిరసపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీశాఖ అధికారులు

మునగపాక : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని అటవీశాఖ అధికారులు కోరారు. మండలంలోని టి.సిరసపల్లిలో 'లైఫ్ స్టయిల్ ఫర్ ఎన్విరాల్‌మెంట్ అవేర్‌నెస్' కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలన్నారు. గుడ్డ సంచులను వినియోగించాలన్నారు. మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. అనకాపల్లి అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ



మూలపేటలో మహిళలకు వైఎస్సార్ సంపూర్ణ కిట్‌లు అందజేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక : మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. శుక్రవారం మూలపేట అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు ఆయన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉన్ననాడే కుటుంబాలు సంతోషకరంగా ఉంటాయన్నారు. అంగన్‌వాడీ టీచర్ నాగమణి, మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రపై అవగాహన



గ్రంథాలయంలో చర్చా కార్యక్రమం

మునగపాక : ప్రతి ఒక్కరూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై అవగాహన పెంచుకోవాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివకోటి దుర్గాప్రసాద్ కోరారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం అంబేడ్కర్ జీవిత చరిత్రకు సంబంధించి చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితం ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అంబేడ్కర్ రచించిన గ్రంథాలు ఎంతగానో దోహదపడ్డాయన్నారు.

ఎండల్లో ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు వడదెబ్బకు గురికాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము కోరారు. శుక్రవారం ఆయన అచ్యుతాపురం మండలంలోని తిమ్మరాజుపేట, ఎర్రవరం గ్రామాల పరిధిలో చేపడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనుల్ని పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఓఆర్ఎస్, మజ్జిగ, మంచినీటి సదుపాయాలను కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో చెల్లిబోయిన అప్పారావు, ధనలక్ష్మి, వరాలమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద చలివేంద్రం



కె.వెంకటాపురంలో ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా ఉపాధి హామీ పనుల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. కె.వెంకటాపురం శివారు సంతలమెట్ట ప్రాంతంలో జరుగుతున్న ట్రెంచ్ వర్క్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పని ప్రదేశంలో చలివేంద్రాన్ని ప్రారంభించి ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పనులను తొందరగా ప్రారంభించి ఎండ తీవ్రత పెరగక ముందే ముగించాలన్నారు. పని జరుగుతున్న ప్రదేశాలలో మంచినీళ్లు తప్పనిసరిగా ఉండాలని, విశ్రాంతి కోసం టెంట్‌లు కూడా వేయాలన్నారు. ఎక్కువగా మంచినీళ్లు తాగుతూ ఉండాలని సూచించారు.